క్లుప్తంగా

మునగపాకలో అయ్యప్ప భిక్ష ప్రారంభం



అయ్యప్ప భిక్ష ప్రారంభిస్తున్న మునగపాక పెద్దలు

మునగపాక: స్థానిక అయ్యప్పస్వామి ఆలయ ప్రాంగణంలో సోమవారం భక్తులకు భిక్ష కార్యక్రమం ఘనంగా ప్రారంభమైంది. 41 రోజుల పాటు ఇక్కడ అయ్యప్ప మాలలు ధరించిన భక్తులతోపాటు ఇతర భక్తులకు సైతం రోజూ మధ్యాహ్నం భిక్ష సదుపాయం కల్పిస్తున్నారు. దాతల సహకారంతో ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్టు కమిటీ సభ్యులు తెలిపారు. సోమవారం గ్రామ పెద్దలు డాక్టర్ బద్దెం సూర్యనారాయణ, కాండ్రేగుల జగ్గారావు, సూరిశెట్టి కన్నారావు, మొల్లేటి సత్యనారాయణ, ఆడారి సన్యాసిరావు, బొడ్డేడ అప్పలనాయుడు, ఆడారి కాశీబాబు, పెంటకోట ఉమేష్, విల్లూరి నూకనరసింగరావు, వెలగా మురళి, వెలగా రామకృష్ణ, కిరణ్ తదితరులు భిక్ష ప్రారంభోత్సవ కార్యక్రమాన్ని నిర్వహించారు.

సత్తెమ్మతల్లి ఆలయ నిర్మాణానికి విరాళం



గుడికి విరాళం అందజేస్తున్న ఉమేష్

మునగపాక: స్థానిక చెరువు కాలువ సంఘ పరిధిలో సత్తెమ్మతల్లి ఆలయ నిర్మాణ పనులు చురుగ్గా సాగుతున్నాయి. పలువురు దాతలు ఆలయ నిర్మాణానికి తమవంతు సాయం అందజేస్తున్నారు. సోమవారం మునగపాకకు చెందిన పెంటకోట ఉమేష్ తనవంతు సాయంగా రూ.10,116 విరాళంగా అందజేశారు. కార్యక్రమంలో బొడ్డేడ అప్పలనాయుడు, వెలగా మురళి, జల్లేపల్లి కృష్ణారావు, కాండ్రేగుల జగ్గారావు, ఆడారి కాశీబాబు, వెలగా వెంకటప్పారావు, వెలగా రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.


సాగు పట్టా ఇవ్వాలని వినతి



తహసీల్దారు తిరుమలబాబుకు వినతిపత్రం అందిస్తున్న సీపీఐ నాయకులు

కోటవురట్ల: 15 ఏళ్లుగా సాగు చేసుకుంటున్న ప్రభుత్వ భూమికి సాగు పట్టా ఇవ్వాలని సీపీఐ నాయకులు కోరారు. సీపీఐ ఆధ్వర్యంలో తహసీల్దారు తిరుమలబాబుకు సోమవారం వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ అన్నవరం గ్రామానికి చెందిన పైల నాగేశ్వరరావు అనే నిరుపేద కూలీ సర్వే నంబరు 259లో ఖాళీగా ఉన్న 2.50 ఎకరాల ప్రభుత్వ భూమిలో జీడి సాగుతో జీవనం సాగిస్తున్నాడని తెలిపారు. ఆ భూమికి 1985లో విశాఖకు చెందిన ఎనరెడ్డి ముసలయ్య, ఎనరెడ్డి రూపావతి ప్రభుత్వం డీపట్టా ఇచ్చిందని, రెవెన్యూ సిబ్బంది ఆన్‌లైన్ చేశారని దౌర్జన్యం చేస్తున్నారని తెలిపారు. ఆ భూమిలోకి వస్తే చట్టపరంగా చర్యలు తీసుకుంటామని హెచ్చరిస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. క్షేత్రస్థాయిలో విచారణ చేసి న్యాయం చేయాలని, సాగు దారుకు పట్టా ఇవ్వాలని కోరారు.

ఆరోగ్యపు అలవాట్లు అలవర్చుకోవాలి



విద్యార్థులతో ప్రతిజ్ఞ చేయిస్తున్న వైద్య ఆరోగ్య సిబ్బంది

కోటవురట్ల: విద్యార్థులు ఆరోగ్యపు అలవాట్లు అలవర్చుకోవాలని వైద్య ఆరోగ్య సిబ్బంది సూచించారు. రామచంద్రపురం ఎంపీయూపీ స్కూల్‌లో వైద్య ఆరోగ్య సిబ్బంది ఆధ్వర్యంలో విద్యార్థులకు గుండె జబ్బులు, సీపీఆర్ చేసే విధానం, మంచి ఆహారపు అలవాట్లపై సోమవారం అవగాహన కల్పించారు. డిజిటల్ స్క్రీన్‌పై ఎవరికైనా గుండెపోటు వచ్చినపుడు అత్యవసరంగా చేయాల్సిన సీపీఆర్ విధానాన్ని వివరించారు. తల్లిదండ్రులకు అర్థమయ్యేలా వివరించాలని సూచించారు. చిన్నతనం నుంచి మంచి ఆహారపు అలవాట్లు పాటించాలన్నారు. కార్యక్రమంలో హెల్త్ సూపర్‌వైజర్ ఎస్.సునీత, హెల్త్ అసిస్టెంట్ పి.శ్రీనివాసరావు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

నియామకపు పత్రాలు అందజేత

కోటవురట్ల/నక్కపల్లి/ఎస్. రాయవరం: మెగా డీఎస్సీ ద్వారా ఎంపికైన ఉపాధ్యాయులకు సోమవారం ఎంఈవోలు నియామకపు పత్రాలు అందజేశారు. వివిధ ఉపాధ్యాయ సంఘాల ప్రతినిధులతోపాటు ఏపీటీఎఫ్ జిల్లా అధ్యక్షుడు కె.కె.ఎల్.ఎస్. ధర్మారావు వారికి శుభాకాంక్షలు తెలిపారు. అన్ని విధాలుగా సహాయ సహకారాలు అందిస్తామని హామీ ఇచ్చారు. అనంతరం సర్వీసు రిజిస్టర్లు అందజేశారు. ఎంఈవోలు మాట్లాడుతూ ఉపాధ్యాయ వృత్తి ఎంతో పవిత్రమైనదని, గౌరవం ఆపాదించేలా వ్యవహరించాలని సూచించారు. సర్వీసు రిజిస్టర్లను జాగ్రత్తగా భద్రపరుచుకోవాలని సూచించారు.

కల్తీ మద్యం దందాపై నిరసన



మాట్లాడుతున్న నియోజకవర్గ ఇన్‌చార్జ్ కంబాల జోగులు

- సీబీఐతో విచారణ చేయాలి
- బెల్టు షాపులు నిర్మూలించాలని డిమాండ్
- యలమంచిలి, పాయకరావుపేటలో వైఎస్సార్‌సీపీ శ్రేణుల ర్యాలీ



యలమంచిలి ఎక్సైజ్ అండ్ ప్రొహిబిషన్ స్టేషన్ వద్ద నిరసన తెలియజేస్తున్న బొడ్డేడ ప్రసాద్, కరణం ధర్మశ్రీ, వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు

యలమంచిలి రూరల్: రాష్ట్ర వ్యాప్తంగా మద్యం బెల్టు షాపులను నిర్మూలించి, కల్తీ మద్యం దందాపై సీబీఐ విచారణ జరిపించాలని వైఎస్సార్‌సీపీ అనకాపల్లి పార్లమెంటు, యలమంచిలి నియోజకవర్గ సమన్వయకర్తలు బొడ్డేడ ప్రసాద్, కరణం ధర్మశ్రీ రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. కూటమి అధికారంలోకి వచ్చాక గ్రామాలు, వీధుల్లో ఎక్కడచూసినా మద్యం బెల్టు షాపులు విచ్చలవిడిగా నిర్వహిస్తున్నారన్నారు. 24 గంటలూ మద్యం అందుబాటులో ఉంటోందని వాపోయారు. సోమవారం వైఎస్సార్‌సీపీ పిలుపు మేరకు యలమంచిలిలో పార్టీ నాయకులు, కార్యకర్తలతో నిరసన ర్యాలీ చేపట్టారు. తొలుత స్థానిక ఎక్సైజ్ అండ్ ప్రొహిబిషన్ స్టేషన్ వరకు ర్యాలీ నిర్వహించిన తర్వాత కల్తీ మద్యం అరికట్టాలని నినాదాలు చేశారు. తర్వాత ఇన్‌చార్జి ఎక్సైజ్ సీఐ ఎం జ్ఞానేశ్వరికి రాష్ట్రంలో మద్యం విధానాన్ని వ్యతిరేకిస్తూ పలు డిమాండ్లతో కూడిన వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా బొడ్డేడ ప్రసాద్, కరణం ధర్మశ్రీ మాట్లాడుతూ రాష్ట్రంలో కల్తీ మద్యం దందాను టీడీపీ నాయకులే స్వయంగా నిర్వహిస్తూ ప్రజల ప్రాణాలను హరిస్తున్నారన్నారు. విచ్చలవిడిగా కల్తీ మద్యం తయారీ యూనిట్లు పెట్టి ధనార్జన కోసం పేద ప్రజల ఆరోగ్యం గుల్ల చేస్తున్నారని ఆరోపించారు. ఏ సమయంలో కావాలన్నా మద్యం దొరుకుతోందంటే ప్రభుత్వం ప్రజల ఆరోగ్యాన్ని ఎలా గాలికి వదిలిందో అర్థం చేసుకోవచ్చన్నారు. గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో ఉత్తమమైన మద్యం పాలసీ అమలు చేశామన్నారు. నిర్ణీత వేళల్లో మాత్రమే ప్రభుత్వ దుకాణాల ద్వారానే మద్యం విక్రయించేలా చూశామన్నారు. ప్రస్తుత కూటమి ప్రభుత్వంలో మద్యం దుకాణాలను ప్రైవేటు వ్యక్తుల చేతుల్లో పెట్టిన దగ్గర్నుంచి మద్యం బెల్టు షాపులను ఇబ్బడిముబ్బడిగా ఏర్పాటు చేసి యువత మద్యానికి బానిసలయ్యేలా పరోక్షంగా ప్రభుత్వమే ప్రోత్సహిస్తోందని విమర్శించారు. కార్యక్రమంలో యలమంచిలి ఎంపీపీ బోదెపు గోవింద్, జెడ్పీటీసీ సేనాపతి సంధ్యారాణి రాము, రాష్ట్ర మహిళా విభాగం కార్యదర్శి పలివెల అమృతవల్లి, రేగుపాలెం సర్పంచ్ రాజాన మహాలక్ష్మి, యలమంచిలి మున్సిపల్ వైస్ చైర్మన్ అర్రెపు గుప్తా, రూరల్ పార్టీ అధ్యక్షుడు కొల్లి త్రినాథ్, జిల్లా బీసీ సెల్ అధ్యక్షుడు ఉద్దండం త్రినాథరావు, వార్డు కౌన్సిలర్లు దూది నర్సింహమూర్తి, పిట్టా సత్తిబాబు, రాపేటి సంతోష్, దాసరి కుమార్, దుంగా అచ్యుతరావు, పార్టీ నాయకులు నెట్టెం సత్యనారాయణ, పిల్లా త్రినాథరావు, మర్రి రాజు, కొశ్ల సీతారాం, ఉప్పులూరి కిరణ్, ఈరిగిల చంటి, గొంపాని శివ, రాజాన శ్రీను, వాసు, గొర్లి వెంకట్, కార్యకర్తలు పాల్గొన్నారు.

నకిలీ మద్యంతో ప్రజల ప్రాణాలతో చెలగాటం: జోగులు



నారా వారి నకిలీ మద్యంపై నిరసన ర్యాలీ చేపడుతున్న కంబాల జోగులు, బొడ్డేడ ప్రసాద్, చిక్కాల, వీసం నాయకులు

పాయకరావుపేట: రాష్ట్రంలో నకిలీ మద్యంతో కూటమి ప్రభుత్వం ప్రజల ప్రాణాలతో చెలగాట మాడుతుందని మాజీ ఎమ్మెల్యే, నియోజకవర్గ సమన్వయకర్త కంబాల జోగులు ఆగ్రహం వ్యక్తం చేశారు. రాష్ట్రంలో నకిలీ మద్యం అరాచకానికి నిరసనగా కంబాల జోగులు ఆధ్వర్యంలో సోమవారం స్థానిక ఎక్సైజ్ కార్యాలయం ఎదుట పార్టీ శ్రేణులు నిరసన చేపట్టాయి. పట్టణంలోని వైఎస్సార్ సీపీ జిల్లా అధికార ప్రతినిధి దగ్గుపల్లి సాయిబాబా కార్యాలయం నుంచి నాయకులు ర్యాలీగా బయలుదేరి ఎక్సైజ్ కార్యాలయం వద్ద నిరసన చేపట్టారు. అనంతరం ఎక్సైజ్ సీఐ జి.శ్రీనివాసరావుకు నారా వారి నకిలీ మద్యం అరికట్టాలని వినతి పత్రం అందించారు. ఈ సందర్భంగా నియోజకవర్గ ఇన్‌చార్జి కంబాల జోగులు మాట్లాడుతూ కూటమి ప్రభుత్వంలో అధికార పార్టీ నాయకులు తంబళ్లపాలెం నుంచి శ్రీకాకుళం వరకు ఎక్కడపడితే అక్కడ నకిలీ మద్యం తయారు చేస్తూ అమ్మకాలు సాగిస్తూ కోట్లు సంపాదిస్తున్నారని దుయ్యబట్టారు. దీనిపై వీడియోలతో సహా బట్టబయలైందని, వీరిపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. రాష్ట్రంలో ఎక్కడ చూసినా బెల్టు షాపులు వెలిశాయన్నారు. వైఎస్సార్ సీపీ పాలనలో అవినీతి జరగకపోయినా సరే అప్పటి ప్రతిపక్ష నేత చంద్రబాబు విమర్శలు చేసేవారన్నారు. నక్కపల్లి, ఎస్. రాయవరం, కోటవురట్ల మండలాలకు చెందిన పార్టీ మండల అధ్యక్షులు శీరం నర్సింహమూర్తి, మధువర్మ, కిల్లాడ శ్రీనివాసరావు, పాయకరావుపేట మండల సీనియర్ నాయకులు గెడ్డమూరి శ్రీనివాసరావు మాట్లాడుతూ నారా వారి నకిలీ మద్యాన్ని కట్టడి చేసి, ప్రజల ప్రాణాలను కాపాడాల్సిన బాధ్యత ప్రభుత్వంపై ఉందన్నారు. ఈ నిరసన ర్యాలీలో వైఎస్సార్ సీపీ అనకాపల్లి పార్లమెంట్ నియోజకవర్గ ఇన్‌చార్జి బొడ్డేడ ప్రసాద్, పార్టీ రాష్ట్ర కార్యదర్శులు చిక్కాల రామారావు, వీసం రామకృష్ణ, పార్టీ జిల్లా అధికార ప్రతినిధి దగ్గుపల్లి సాయిబాబా, ఎంపీపీ ఇసరపు పార్వతీ తాతారావు, పాల్మన్‌పేట, కేశవరం, సత్యవరం, గోపాలపట్నం సర్పంచ్‌లు కోడ కోటేశ్వరరావు, మేడిశెట్టి రామగోవిందు, సకిలేటి రాము, పన్నీరు బాబ్జి, పార్టీ మండల మాజీ అధ్యక్షుడు ధనిశెట్టి బాబూరావు, పట్టణ అధ్యక్షుడు ధనిశెట్టి మహేష్, పాయకరావుపేట ఉప సర్పంచ్ జగతా భవాని శ్రీనివాస్, సత్యవరం, మాసాహేబుపేట, గుంటపల్లి ఎంపీటీసీలు తమ్మిర్సి సత్యనారాయణ, యాగదాసు శ్రీదేవి శేఖర్, కొంతం నరేష్, పల్లేల లక్ష్మణ్, రాష్ట్ర మత్స్యకార కార్పొరేషన్ మాజీ డైరెక్టర్ చోడిపల్లి శ్రీను, పీఏసీఎస్ మాజీ అధ్యక్షుడు దేవవరపు రాజేష్ ఖన్నా, పార్టీ జిల్లా కార్యదర్శులు దేవవరపు వెంకటేశ్వరరావు, యజ్జల అన్నవరం, కోటవురట్ల పార్టీ మండలం మాజీ అధ్యక్షుడు పైల రమేష్, గొడిచెర్ల పీఏసీఎస్ మాజీ అధ్యక్షుడు పాడిగట్ల పాపారావు, పార్టీ బీసీ సెల్ మండల అధ్యక్షుడు పక్కుర్తి లోవకుమార్, పార్టీ పట్టణ యూత్ అధ్యక్షుడు పిరాధి రాజు, సూరకాసుల గోవిందు తదితరులు పాల్గొన్నారు.

19న ధన్వంతరి జయంతి

- పాల్గొననున్న డాక్టర్ గోపాలన్ రవీంద్రన్, చాగంటి కోటేశ్వరరావు



డాక్టర్ గోపాలన్ రవీంద్రన్



ఆధ్యాత్మికవేత్త చాగంటి కోటేశ్వరరావు

పాయకరావుపేట: ఈనెల 19వ తేదీన శ్రీప్రకాష్ విద్యా సంస్థలో ధన్వంతరి జయంతి కార్యక్రమం నిర్వహించడం నిర్వహిస్తున్నట్టు విద్యా సంస్థల యాజమాన్యం ఒక ప్రకటనలో తెలిపింది. ప్రముఖ ఆయుర్వేద వైద్యులు డాక్టర్ కన్నాలయం గోపాలన్ రవీంద్రన్, ప్రముఖ ప్రవచనకర్త, ఆధ్యాత్మికవేత్త చాగంటి కోటేశ్వరరావు హాజరుకానున్నట్లు తెలిపారు. వారిని ఈ సందర్భంగా ఘనంగా సన్మానించనున్నట్టు తెలిపారు.

వైఎస్సార్‌సీపీ గ్రామ కమిటీ నియామకం



పెట్టుగోళ్లపల్లి గ్రామ కమిటీతో మాజీ ఎమ్మెల్యే కంబాల

ఎస్.రాయవరం: గ్రామ కమిటీలదే 2.0లో తుది నిర్ణయమని పార్టీ అధినేత వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఇప్పటికే చెప్పారని, ఇకపై అమలుకు శ్రీకారం చుట్టాలని పాయకరావుపేట నియోజకవర్గ సమన్వయకర్త, మాజీ ఎమ్మెల్యే కంబాల జోగులు అన్నారు. పెట్టుగోళ్లపల్లిలో పార్టీ అధ్యక్షుడు మధువర్మతో ఆయన కలిసి 12 మంది సభ్యులతో కూడిన గ్రామ కమిటీని ప్రకటించారు. గ్రామ శాఖ గౌరవాధ్యక్షుడిగా వియ్యపు పోతురాజు, అధ్యక్షుడిగా చొప్పా రాజు, ప్రధాన కార్యదర్శులుగా అల్లు వెంకటేశ్వర్లు, గింజాల మంగరాజు, సర్వసిద్ధి వెంకటరాజు, సకురు రాజేష్, కార్యదర్శులుగా కొండ్ర రాజు, మొల్లి బాబూరావు, రాకోటి వెంకటమురళీమోహన్, కొప్పిశెట్టి నాగరాజు, సింహాచలం, బూత్ కమిటీ సభ్యునిగా కొల్లి సత్యరావులను నియమించారు. వీరిని మాజీ ఎమ్మెల్యే సత్కరించారు. పార్టీ కార్యక్రమాల్లో చురుగ్గా పాల్గొనాలని సూచించారు. రాబోయేవి అన్నీ మంచి రోజులే అన్నారు.

విద్యార్థులకు ప్రోత్సాహకాలు అందజేత



విద్యార్థులకు ప్రోత్సాహకాలు అందజేస్తున్న ఎన్ఆర్ఐ పురోగామి

మునగపాక: మండలంలోని తోటాడ జెడ్పీ హైస్కూల్ ఆవరణలో సోమవారం ఎన్ఆర్ఐ బుద్ధ పురోగామి పదో తరగతిలో మెరిట్ సాధించిన విద్యార్థులకు ప్రోత్సాహకాలు అందజేశారు. బుద్ధ పశుపతిరావు జ్ఞాపకార్థంగా కుమారుడు పురోగామి (ఎన్ఆర్ఐ) ఉగాది ఫౌండేషన్ ద్వారా బుద్ధ పశుపతిరావు మెమోరియల్ అవార్డ్స్ కింద నగదు అందజేశారు. పదిలో మండల స్థాయిలో మొదటి స్థానం సాధించిన ఆడారి లక్ష్మీగణేష్‌కు రూ.10 వేలు, తోటాడ హైస్కూల్‌లో 2024–25లో పదిలో మంచి మార్కులు సాధించిన బొడ్డేడ మహిషా మహాలక్ష్మి, పాలమరశెట్టి వీర రమ్య, కనిశెట్టి శశిధర్‌లకు రూ.5 వేల వంతున, మరికొంత మందికి రూ.3 వేల వంతున అందజేశారు. తోటాడ హైస్కూల్‌కు రూ.50 వేల విలువ చేసే టేబుల్ టెన్నిస్ బోర్డును బహూకరించారు. ఈ సందర్భంగా పురోగామి మాట్లాడుతూ విద్యార్థులు ఏకాగ్రతతో చదువుకుంటే మంచి ఫలితాలు సాధించవచ్చన్నారు. చదువుతో పాటు క్రీడల్లోనూ రాణించాలన్నారు. హెచ్ఎం రామలక్ష్మి, ఎస్ఎంసీ చైర్మన్ కరణం సంతోష్, ఎంపీటీసీ మద్దాల వీరునాయుడు, బొడ్డేడ శ్రీను, కాండ్రేగుల శివ, ఆడారి ప్రసాద్, దొడ్డి రమేష్, ఆడారి ఆనంద్ సన్యాసినాయుడు, ఆళ్ల సాంబశివ, పాలమరశెట్టి ప్రసాద్ పాల్గొన్నారు.

తప్పని రోడ్డు వెతలు



రాంబిల్లి మండలం కట్టబోలు వద్ద పాడైన రహదారి

రాంబిల్లి(అచ్యుతాపురం): చెంతనే ప్రతిష్టాత్మకంగా నిర్మిస్తున్న నేవల్ బేస్ సంస్థ వల్ల తమకు రహదారి కష్టాలు తీరుతాయని భావించిన గ్రామస్తులకు నిరాశే మిగులుతోంది. పరిశ్రమలు వచ్చిన తర్వాత మౌలిక సదుపాయాలు పెరగటం మాటలా ఉన్నా రహదారి వెతలు మాత్రం రాంబిల్లి మండలంలోని దిమిలి, కట్టబోలు, మురకాడ, మర్రిపాలెం, కుమ్మరాపల్లి, రజాల గ్రామాలకు తప్పడం లేదు. ఒకవైపు కుచించుకుపోయిన రహదారితో రాత్రి వేళల్లో వాహన చోదకులు భయాందోళనలకు గురవుతున్నారు. ముఖ్యంగా కట్టబోలు వద్ద ఈ రహదారి తీవ్రంగా పాడవ్వడంతో ఆర్అండ్‌బీ శాఖ దృష్టి సారించాల్సి ఉంది. వర్షాకాలమొస్తే పరిస్థితి మరింత ప్రమాదకరంగా మారుతోందని, తరచూ వాహనాలు పాడైపోవడం, ప్రయాణికులు గాయాలపాలవ్వడం జరుగుతోందని ఆయా గ్రామాల ప్రజలు వాపోతున్నారు.

భూమి చదును పనులు అడ్డుకున్న నిర్వాసితులు



పనులు అడ్డుకున్న భూ నిర్వాసితులు

మాకవరపాలెం: ఏపీఐఐసీ భూముల్లో చేపట్టిన భూమి చదును పనులను అన్‌రాక్ నిర్వాసితులు అడ్డుకున్నారు. మండలంలోని రాచపల్లి వద్ద నిర్మించిన అన్‌రాక్(పయినీర్) అల్యూమీనియం రిఫైనరీ కోసం 2008లో 2200 ఎకరాల భూమిని ప్రభుత్వం సేకరించింది. అయితే భూ సేకరణ సమయంలో హామీ ఇచ్చిన ఇంటికి ఒక ఉద్యోగం, పాడి గేదెలు, రెండు సెంట్ల స్థలం ఇప్పటికీ అందించలేదు.

బదిలీలు, పదవీ విరమణ అనివార్యం



ఉపాధ్యాయిని పద్మావతిని సత్కరిస్తున్న ఉపాధ్యాయులు

యలమంచిలి రూరల్: ఉపాధ్యాయులకు బదిలీలు, పదవీ విరమణ అనివార్యమని ప్రధానోపాధ్యాయిని భవానీ తెలిపారు. పట్టణ రైల్వే స్టేషన్ రోడ్డులోని జెడ్పీ ఉన్నత పాఠశాలలో పని చేసి బదిలీపై వెళ్లిన హిందీ ఉపాధ్యాయిని కె. పద్మావతిని ఘనంగా సత్కరించారు. సోమవారం ఇక్కడ పాఠశాలలో విద్యార్థులు, ఉపాధ్యాయ సిబ్బంది సమక్షంలో ఆమెకు దుశ్శాలువాతో సత్కరించి జ్ఞాపిక బహూకరించారు. ఈ సందర్భంగా హెచ్ఎం మాట్లాడుతూ విధులు నిర్వర్తించిన చోట అంకిత భావంతో పనిచేసే ఉపాధ్యాయులకు విద్యార్థులు, సహచర సిబ్బంది మర్చిపోలేరన్నారు. కార్యక్రమంలో మల్లిపాటి సత్యనారాయణ, డీవీ భారతి, కే రాజేష్, ఎన్ వీఆర్ఎం కిషోర్, పీ శ్రీనివాసరావు, టీ ఇందిరారాణి, జీఎస్ కామేశ్వరి, ఎస్‌వీఎన్ఎస్ వరలక్ష్మి పాల్గొన్నారు.

కోటి సంతకాల సేకరణ ప్రారంభం

- మెడికల్ కళాశాలలను ప్రైవేటుపరం చేయొద్దని డిమాండ్



పెట్టుగోళ్లపల్లిలో కోటి సంతకాల సేకరణ చేస్తున్న మాజీ ఎమ్మెల్యే కంబాల జోగులు

ఎస్.రాయవరం: నారా చంద్రబాబునాయుడు నాలుగు సార్లు సీఎం అయినా ఉమ్మడి రాష్ట్రంతో పాటు ప్రస్తుత ఏపీలో ఒక్క మెడికల్ కళాశాల ఏర్పాటు చేయలేదని వైఎస్సార్‌సీపీ నియోజకవర్గ సమన్వయకర్త కంబాల జోగులు విమర్శించారు. రాష్ట్రంలో ప్రభుత్వ మెడికల్ కళాశాలలు ప్రైవేటు పరం కాకుండా కాపాడుకోవాలని జగన్‌మోహన్ రెడ్డి ఇచ్చిన పిలుపు మేరకు కోటి సంతకాల సేకరణ కార్యక్రమాన్ని మండలంలోని పెట్టుగోళ్లపల్లిలో సోమవారం కంబాల జోగులు ప్రారంభించారు. ఇందులో భాగంగా గ్రామానికి చెందిన సీనియర్ నాయకుడు వియ్యపు పోతురాజుతో తొలి సంతకం తీసుకున్నారు. ముందుగా గ్రామంలో వైఎస్సార్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా కంబాల జోగులు మాట్లాడుతూ ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో అప్పటి సీఎం వైఎస్ రాజశేఖర్‌రెడ్డి ఐదు మెడికల్ కళాశాలలు ఏర్పాటు చేస్తే, ఆయన తనయుడు మాజీ సీఎం జగన్‌మోహన్‌రెడ్డి రాష్ట్రంలో 13 జిల్లాలకు 17 కళాశాలలు తీసుకువచ్చారన్నారు. వాటిని చంద్రబాబు ప్రభుత్వం పూర్తి చేయకపోగా, పీపీపీ పద్ధతిలో ప్రైవేటు వ్యక్తులు చేతిలో పెట్టడం దారుణమన్నారు. ఆ ప్రక్రియను అడ్డుకోవాలంటే రాష్ట్రంలో కోటి సంతకాలు అవసరం అన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా కోటి సంతకాలు పూర్తి చేసి గవర్నర్‌ను కలిసి మెడికల్ కళాశాలలు ప్రైవేటు పరం కాకుండా ప్రతిపక్ష నాయకుడు కాపాడుతారన్నారు. ఈ మేరకు గ్రామాల్లో కూటమి ప్రభుత్వం చేస్తున్న ప్రజా వ్యతిరేక కార్యక్రమాలు ప్రజలకు వివరించాలన్నారు. కూటమి సూపర్ సిక్స్‌లో ఒక్క రన్ కూడా సక్రమంగా తీయలేకపోయారని విమర్శించారు. ఏడాదిన్నర పాలనలో మండలంలో అడ్డురోడ్డు –దార్లపూడి రోడ్డు గతుకులు కప్పలేకపోయారన్నారు. అదేవిధంగా రామయ్యపట్నంలోనూ కోటి సంతకాల సేకరణ కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో పార్టీ మండల అధ్యక్షుడు ఎస్ఏఎన్ మధువర్మ, ఉపాధ్యక్షుడు వెదుళ్ల బంగారి, వైస్ ఎంపీపీ చోడిపల్లి అప్పన్న, సర్పంచ్‌ల సంఘం మండల అధ్యక్షుడు కర్రి సత్యనారాయణ, సర్పంచ్‌లు వైబోయిన సత్యనారాయణ, మల్లే లోవరాజు, గరగా శ్రీనివాసరావు, చోడిపల్లి గోవిందు, సీనియర్ నాయకులు చేకూరి శ్రీరామచంద్రరాజు, వియ్యపు వరహాలు, చొప్పా రాజు, అద్దేపల్లి నూకునాయుడు, పోచిన నరేష్, మైలారు శ్రీనివాసరావు, పినపాత్రుని ప్రసాద్, కంచిమూతి శ్రీనివాస్, చేకూరి అశోక్, వియ్యపు సింహాద్రి, నల్లపరాజు వెంటరాజు తదితరులు పాల్గొన్నారు.

సాగునీటి కాలువలపై నిర్లక్ష్యపు నీడలు

- అధ్వానంగా సాగునీటి కాలువలు
- పలు చోట్ల తూటికాడలతో మురుగునీరు దర్శనం
- పట్టని అధికారులు



ఉమ్మలాడలో సాగునీటి కాలువలో మురుగునీరు



మునగపాకలో అధ్వానంగా ఉన్న సాగునీటి కాలువ

మునగపాక: సీజన్‌కు ముందుగానే సాగునీటి కాలువలను అభివృద్ధి చేయాల్సి ఉన్నా, కూటమి పాలకులు నిమ్మకు నీరెత్తనట్లు వ్యవహరిస్తున్నారు. దీంతో పంటల సాగు ఎలా అంటూ రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఎన్నికల ముందు కూటమి ప్రభుత్వం రైతులకు ఇచ్చిన హామీలు అమలు కాలేదు. కనీసం సాగునీటి వనరులపైనైనా దృష్టి సారించడం లేదని వాపోతున్నారు.

అధ్వానంగా సాగునీటి వనరులు...

మండలంలోని పలు సాగునీటి కాలువలు అధ్వానంగా ఉన్నాయి. పలు చోట్ల కాలువల్లో తూటికాడ పేరుకుపోతుంది. దీంతో ఎగువ నుంచి వచ్చే నీరు దిగువ ప్రాంతాలకు ప్రవహించే పరిస్థితులు అంతంత మాత్రంగానే కనిపిస్తున్నాయి. కేవలం సాగునీటి కాలువలపై ఆధారపడి పంటల సాగు చేపట్టే రైతులు అధికారుల తీరుపై మండిపడుతున్నారు. కాలువలను అభివృద్ధి చేయాల్సి ఉన్నా పట్టనట్లు వ్యవహరిస్తున్నారంటూ ఆందోళన చెందుతున్నారు.

మురుకుకూపాలుగా కాలువలు...

మండలంలోని ఉమ్మలాడ, నాగులాపల్లి గ్రామాల్లో సాగునీటి కాలువలు స్వరూపం కోల్పోతున్నాయి. సాగునీటి కాలువల్లో మురుగునీరు ప్రవహిస్తుంది. దీంతో పంటల సాగు ఎలా అంటూ రైతులు వాపోతున్నారు. సాగునీటి కాలువల్లోకి మురుగునీరు రాకుండా చూడాల్సిన అధికారులు పట్టించుకున్న దాఖలాలు లేవంటూ ఆందోళన చెందుతున్నారు. మరికొన్ని చోట్ల సాగునీటి కాలువలు తుప్పలతో నిండిపోతున్నాయి. దీంతో సాగునీటి ప్రవాహం ప్రశ్నార్థకంగా మిగిలిందంటూ వాపోతున్నారు.

3,897 హెక్టార్ల మేర సాగు...

మండల వ్యాప్తంగా పలు రకాల పంటల సాగు 3,897 హెక్టార్లుగా ఉంది. చెరకు 1,053 హెక్టార్లు కాగా, వరి 1,456 హెక్టార్ల మేర సాగు చేస్తున్నారు. మిగిలిన 1,385 హెక్టార్లకు సంబంధించి పలు రకాల పంటలు పడిస్తున్నారు. ఆయా పంటలకు సాగునీటి వనరులే ఆధారంగా రైతులు సాగు చేస్తున్నారు. అయితే సీజన్‌కు ముందుగా సాగునీటి వనరులపై దృష్టి సారించాల్సిన అధికారులు పట్టించుకోలేదంటూ ఆవేదన చెందుతున్నారు. పలుమార్లు సమస్యలను ఉన్నతాధికారుల దృష్టికి తీసుకువచ్చినా ఫలితం లేదంటూ ఆందోళన చెందుతున్నారు.

తూటికాడ తొలగింపునకు చర్యలు

సాగునీటి కాలువల్లో పేరుకుపోయిన తూటికాడ తొలగింపు చర్యలు చేపడతాం. కాలువలను అభివృద్ధి చేయడం ద్వారా రైతాంగానికి సాగునీరు ప్రవహించేలా చూస్తాం. ఇప్పటికే పలు ప్రాంతాల్లో సాగునీటి కాలువల ద్వారా నీరు అందించేలా చర్యలు తీసుకున్నాం. రైతులకు మెరుగైన సేవలందించేందుకు కృషి చేస్తున్నాం.

– వి. ఇంద్రసేనా రెడ్డి, నీటిపారుదల శాఖ ఏఈ

చెరువుల్లో గంబూషియా చేపల పెంపకం



బయ్యవరంలో చెరువులో గంబూషియా చేప పిల్లలు వేస్తున్న జిల్లా మలేరియా అధికారి సత్యప్రసాద్

కశింకోట: మండలంలోని పలు మంచినీటి చెరువుల్లో దోమల నివారణకు 'గంబూషియా' చేపల పెంపకాన్ని సోమవారం ప్రారంభించారు. జిల్లా మలేరియా అధికారి సిహెచ్. సత్యప్రసాద్ ఈ సందర్భంగా చేప పిల్లలను చెరువులో విడిచిపెట్టారు. బయ్యవరం, తాళ్లపాలెం, నరసింగబిల్లి వద్ద చెరువుల్లో వీటిని పెంపకానికి వేశారు. మలేరియా, చికెన్ గునియా వంటి వ్యాధులకు కారణమయ్యే దోమల లార్వాలు మంచినీటిలో వృద్ధి చెందుతాయని, వాటిని ఈ చేపలు తిని వ్యాధుల నివారణకు దోహదపడతాయని ఈ సందర్భంగా సత్యప్రసాద్ తెలిపారు. గ్రామ నాయకుడు షేక్ రెహమాన్, ఆరోగ్య సిబ్బంది కార్యక్రమంలో పాల్గొన్నారు.